# విషాద చిత్రం

క్యాన్వాసు మీద కుంచె కదను తొక్కుతోంది. ఒక ఆవేదనకి రూపం పోయాలన్న తపన, ఒక ఆవేశానికి ప్రాణప్రతిష్ఠ చేయాలన్న ఆరాటం, ఒక ఆర్తనాదానికి అద్దం పట్టాలన్న ఆర్తి, కుంచె పట్టిన చేతిని కుదిపేస్తోంది.

అందుకే రంగుల్తో పోరాడుతోంది కుంచె. కుంచె వెంట పరుగెడుతున్నాయి కళ్లు. కళ్ల వెనుక మార్గదర్శిగా నిలబడింది మనస్సు.

రంగుల అద్భుత సమ్మేళనంతో రస సృష్టి చేయాలని గాక, రక్తాన్ని సల సల మరిగించాలని రక్తాన్ని రంగుల్లో రంగరించి కుంచెను పరుగెత్తిస్తున్నాడు హంపేన్.

అతడి మెదడులో ఒకటే దృశ్యం. కాదు కొన్ని రోజుల క్రితం జరిగిన యదార్థం సుళ్ళు తిరుగుతోంది!

సత్యం ఓ చిన్న కళాకారుడు. వామపక్ష భావాలు గల కొందరితో కలిసి వీధి నాటకాలాడుతూంటాడు. తన భావాలని ఆశయాల్ని ప్రచారం చేస్తూంటాడు. ఒక పెద్ద పరిశ్రమలో సమ్మె చేస్తున్న కూలీలకు మద్దతుగా తన వారితో కలసి వీధి నాటకం ప్రదర్శించాడు. ఆ నాటికలో పరిశ్రమ యజమాని మీద ఎక్కుపెట్టిన బాణాలెన్నో ఉన్నాయి. అది తెలిసి ఆ పారిశ్రామికవేత్త ఆగ్రహించాడు. ఫలితంగా కిరాయి గూండాలు నాటకా

నికి అర్థాంతరంగా తెరదించారు. ప్రేక్షకుల్ని చెదరగొట్టారు. అంతటితో ఆగలేదు. నటీనటుల్ని చావగొట్టారు. సత్యాన్ని తరిమితరిమి నడిరోడ్డు మీద దారుణంగా హత్య చేశారు.

ఆ మారణ కాండని రంగుల్లో చిత్రించాలని హుస్సేన్ తాప త్రయం. ఆ చిత్రం జనం పాలిట శంఖారావం కావాలని అతడి మథన.

మెదడుని మథించి, రక్తాన్ని మరిగించి, శరీరంలోని అణువణువునీ కుదిపి కుదిపి ఒక అద్భుత సంకేతాన్ని ఆవిష్కరించడానికి కుంచెను పర వళ్లు తొక్కిస్తున్నాడు. జూలు విదిల్చి విజృంభించిన రాక్షసత్వపు పెను చీకటినీ అసహాయతతో అల్లల్లాడుతున్న వన్నని వెలుగు కిరణాన్నీ రంగుల్లో బంధిస్తున్నాడు.

చిత్ర యజ్ఞం పూర్తయింది.
దగ్గర్నుంచి, దూరాన్నుంచి పదేపదే చూశాడు
అతడి మోములో తృప్తి రేఖ విరిసింది.

చెప్పదలిచింది. సూటిగా మానవత గుండెకి తగిలేలా చెప్పగలిగా నని సంతృప్తిపడ్డాడు.

చిత్రాన్ని చూసిన ప్రతివారూ సత్యం దారుణ హత్యకు, ఒక కళా కారుడి మీద జరిగిన అమానుష కాండకీ చలించి, స్పందించి ఆవేశంతో, ఆగ్రహంతో ఆ హంతకుడికీ, అతని మద్దతుదారులకీ వ్యతిరేకంగా కలిసి కదిలి పిడికిళ్ళు బిగిస్తారన్న నమ్మకం కలిగింది.

ఒక నిజమైన ప్రజా కళాకారుడిగా ఒక అన్యాయాన్ని ఒక అకృ త్యాన్ని ఎలుగెత్తి చెప్పగలిగానని తృప్త మనస్సుతో భావించాడు.
ఇది సత్యానికి తను సమర్పిస్తున్న నివాళి అని సంబరపడ్డాడు.
హుస్సేన్ ఆవేశం చల్లారింది.

ఆవేదన ఆలోచనగా మారింది. చిత్ర సృష్టికర్త విమర్శకుడిగా మారాడు. వివిధ కోణాల నుంచి చిత్రాన్ని పరిశీలించాడు. మెరుగులు దిద్దాడు.

నీరసంగా చతికిలపడ్డాడు.

నెరిసిన గడ్డాన్ని నిమురుకుంటూ చిత్రాన్ని చూశాడు ప్రేమగా, లాలనగా, ప్రాణంగా అప్పుడే జన్మనిచ్చిన బిడ్డని చూసిన తల్లిలా.

సంతృప్తి నిండిన మనస్సుతో బయటికొచ్చాడు- తపస్సమాధి నుంచి బయటికొచ్చిన ఋషిపుంగవుడిలా.

అలసిన అతడి ముఖాన్నీ ఎర్రబడ్డ కళ్ళనీ చూసి బెంబేలు పడిందతడి భార్య. పరుగున వెళ్ళి చల్లని నీళ్ళు తెచ్చిచ్చింది. ముఖం కడుక్కుని ఎర్ర తువ్వాలుతో తుడుచుంటూ వచ్చి అరుగుమీద చతికిలపడ్డాడు.

బన్నూ వేడి వేడి చాయ్ తెచ్చిచ్చింది.

భార్య వంక ప్రేమగా చూసి, టీ తాగాడు.

"గీ బొమ్మ లెందుగ్గీస్తవు? అరబ్ షేక్ చెప్పిన బొమ్మలు గియ్యరాదు?"

హుస్సేన్ విననట్లే ఉండిపోయాడు.

"ఛోరి షాదీ కుందని యాదుంటదు మల్ల!" భార్య అంది నిష్ఠూరంగా.

నిట్టూర్చాడు హుస్సేన్.

ఇంట్లో అడుగడుగునా పరచుకున్న దారిద్ర్యం.

పెళ్ళి కెదిగిన కూతురు.

సరైన చదువూ, సంపాదనా లేని కొడుకులు.

ఈ కఠిన సత్యాలను అనుక్షణం కళ్లారా చూస్తూ కూడా రాజీపడలేకపోతున్నాడతడు.

తనను కదిలించిన భావావేశాన్ని చిత్రించడానికి కుంచె పడతాడు తప్ప, డబ్బున్న మారాజులు మెచ్చే చిత్రాలూ, డబ్బు కుమ్మరించడానికి దోహద పడే చిత్రాలూ అతడు గీయడు.

కళ కాసు కోసం కాదని అతడి ప్రగాఢ విశ్వాసం.

అందుకే కష్టాల శిలువని మౌనంగా మోస్తున్నాడు హుస్సేన్.

తల్లి మాటలు విన్నాడు కాబోలు తండ్రి వంక కొరకొరా చూసి విసురుగా వెళ్ళిపోయాడు కొడుకు.

కనకవర్షం కురిపించే నగ్న చిత్రాలని గీయడని తండ్రంటే అతడికి కోపం ఈసడింపు!

ఇది ఎన్నో ఏళ్ళ నుంచి జరుగుతున్న తతంగమే. అందుకే మౌనంగా ఉండిపోయాడు హుస్సేన్.

తన మనస్సుకి నచ్చిన చిత్రాలూ, మనస్సుని కదిలించిన సత్యాలకి చిత్రాలూ మాత్రం వేస్తూంటాడు.

అందుకే చేతిలో కళ, కుంచెలో నైపుణ్యం ఉన్నా బతుకు గొంగళిగా ఉండిపోయింది.

తండ్రి మూడో భార్యకి నాలుగో కొడుగ్గా పుట్టి పంచుకున్న దారిద్ర్యాన్నే కొడుకులకీ పంచుతున్నాడు. పస్తులుంటున్నాడు. అయినా అతనిలో మార్పు రాలేదు. వయస్సు మళ్ళినా సాంఘిక అన్యాయాల మీద కసి పోలేదు. ఆవేశం చల్లారనూ లేదు. అంచేత అతని కళాఖండాలు 'అమూల్యాలై' రంగుల ఖరీదునీ, ఒక పూట కొద్దిసీ మాత్రం సమకూరుస్తున్నాయి.

ఈసారి మాత్రం ప్రతిఫలం ఆశించదలచలేదు. ఆ చిత్రం ద్వారా వచ్చిన డబ్బుని సత్యం కుటుంబానికి తన వంతు బాధ్యతగా సమర్పించాలనుకున్నాడు.

అసలే అతుకుల బొంతగా ఉన్న సత్యం ఇంటి పరిస్థితి అతడి ఘోర మరణంతో సర్వం కోల్పోయి రోడ్డెక్కింది. అశ్రు తర్పణ తప్ప పిసరంత సహాయం చేసే వారు లేక అలమటిస్తుంటే ఆ నిర్ణయానికి కొచ్చాడు. అంతేకాదు, తన పద్ధతికి విరుద్ధంగా చిత్రాన్ని వేలానికివ్వ దలిచాడు. ధరకి అమ్మడం తన ఆశయాల్ని బలి పెట్టడం కాదను కున్నాడు.

రెండ్రోజుల తర్వాత చిత్రానికి చక్కని ఫ్రేము కట్టించి ఆర్చీ అక్షనీర్స్ తలుపు తట్టాడు హంస్పేన్.

ఆర్చీ అక్షనీర్స్‌కి నగరంలో చాలా పెద్ద పేరుంది.

స్వదేశీ, విదేశీ చిత్రాలూ, ప్రఖ్యాత విదేశీ చిత్రాలకి నకళ్ళు, శిల్ప కళాఖండాలూ, ప్రాచీన వస్తువులు మొదలైన అపురూపమూ, అలభ్యమూ అయిన కళా స్వరూపా లెన్నిటినో వేలం వేస్తూంటారు. నగరంలోని ప్రముఖ ధనికులు వేలంలో పాల్గొని తమ హోదాకి తగ్గట్టు అత్యంత అధిక ధరకి పాడుతూంటారు. ఆ రకంగా వార్తల్లో కెక్కి మురిసిపోతూం టారు.

చిత్రాన్ని చూసి పెదవి విరిచేశాడు మేనేజరు. 'సత్యం వధ' అని పెట్టిన పేరు చూసి నిజానికి ముఖం చిట్లించాడు కూడా.

అదేమీ గమనించలేదు హంస్పేన్. చిత్రం గురించీ, చిత్రంలో తను వాడిన ప్రతీకల గురించీ, చిత్రం ఆవిష్కరిస్తున్న సత్యం గురించీ వివరంగా హృద్యంగా వివరించాడు.

"లాభం లేదు, సార్! మీ చిత్రం మాస్టర్ పీసే! కాదనను. దీన్ని ఆర్ట్ గేలరీలో పెడితే అంతా ఆహా! ఓహో! అనటం ఖాయం. కాని ఊరికే చూసి పొగిడే వాళ్ళ కోసం మేమీ వేలాలు నిర్వహించడంలేదు. చూసిన వాళ్ళంతా కొనాలి. చూడగానే కొనాలనిపించాలి. ఇలాంటి

పెయింటింగ్స్ వేలానికి పెడితే మా బాస్ తిడతాడు. ఆర్ట్ ఆక్షనీర్స్ కున్న గుడ్ విల్ కూడా పోతుంది."

"చూడు బేటా! నా కోసం కాదు. సత్యం పోరగాళ్ళ కోసం. ఖానా పరేషాన్ అవుతుంద్రు. ఖానా కేలియే ..." ఆ పై భావాన్ని అతడి కళ్ల నుండి రాలిన కన్నీటి బొట్లు చెప్పాయి.

మేనేజరు కొంచెం కరిగాడు. చిత్రాన్ని మరోసారి పరీక్షగా చూశాడు,

"రంగుల కలయిక బావుంది. భావం కూడా ఫర్లేదు. బాగానే ఉంది. చిత్రం పేరు....ప్చ్! బాగాలేదు. కానీ ఇలాంటివి ఎవరైనా కొంటారా అని ? వేలానికి వచ్చే వాళ్ళంతా హైక్లాస్ వాళ్ళు. డబ్బంటే లెక్కలేని వాళ్ళు. ఏదో గొప్ప కోసం, ప్రచారం కోసం, హోదాగా భావించి కొంటారు తప్ప ఆ చిత్రాలు నచ్చి కాదు. కళా పిపాసతోనూ కాదు. అలాంటి వాళ్లకి ఆకలి కేకలూ, ఆర్తనాదాలూ ఎలా నచ్చుతాయి ? అదే ఏ ఉమర్ ఖయాం సాకీనో, నగ్న స్త్రీనో చిత్రించి ఉంటే హాట్ కేక్స్‌లా అమ్ముడయ్యేవి. కనీసం వీల్డ్ రెబక్కాలా తడిబట్టల్లోని సుందరి అయినా బ్రహ్మాండంగా బిజినెస్ చేసును"

తలొంచుకున్నాడు తప్ప కోపం తెచ్చుకోలేదు హుస్సేన్. ఈ పాట చాలాసార్లు చాలామంది నోట విన్నాడు. ఇహ ఇంట్లో రోజూ వినే అరిగిపోయిన రికార్డే.

హుసేన్ పరిస్థితి కదిలించిందో లేక, చిత్రం ఆవిష్కరించిన నగ్న సత్యమే కరిగించిందో కాని మొత్తానికి ఒప్పుకున్నాడు మేనేజరు. అవసర మైన కాగితాల మీద సంతకాలు పెట్టించుకున్నాడు. తమ కమీషన్ వివ రాలు కూడా చెప్పి మర్నాడు రమ్మన్నాడు.

ఒంట్లో నలతగా ఉన్నందున మర్నాడు వెళ్ళలేకపోయాడు.మూడో రోజున వెళ్ళాడు.

అతడ్ని చూస్తూనే కౌగిలించుకున్నంత పని చేశాడు మేనేజరు. ఆనందంతో మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు.

కొత్త అనుభవానికి తబ్బిబ్బు పడ్డాడు హాన్సెన్. ఒక కళాకారుడి కింత విలువా, గౌరవం ఇచ్చే వాళ్ళు దేశంలో ఉన్నారంటే నమ్మకం చిక్కడం లే దతడికి.

"మీ పెయింటింగ్‌కి గొప్ప రేటు పలికిందండీ! ఎంతకు పాడారో తెలుసా? ఎనభై రెండువేలు. మేం ఊహించలే దనుకోండి. అంతా ఖలేగా పోటీ పడ్డారు. ఆఫ్‌కోర్స్- మేం కూడా పెయింటింగ్ గురించి బాగా పబ్లిసిటీ ఇచ్చాంలెండి. ఇవాళ్టి పేపర్లనిండా మీ పెయింటింగ్ గురించే రాశారు, చూడండి"

అవాళ్టి పేపర్లు అతడి ముందుపడేశాడు.

పిసరంత ప్రశంసకే పొంగిపోతాడు కళాకారుడు.

అందుకే ఉత్కంఠతో చూశాడు హాన్సెన్.

ఆర్ట్స్ ఆక్షనీర్స్ నిర్వహించిన వేలంలో ఒక పెయింటింగ్ అద్భుతమైన ధరకి అమ్ముడయిందని రాశారు. నగరంలోని చాలామంది ప్రముఖులు దాని కోసం పోటీపడ్డారట. కడకి శ్యాంసుందర్ అనే పారిశ్రామిక వేత్త దాన్ని చేజిక్కించుకున్నారనీ రాశారు. అతడి గురించి, అతడి అభిరుచుల గురించీ కూడా నాలుగు మాటలు రాశారు.

ఏ పేపర్లోనూ చిత్రం గురించి రాయలేదు. ఆ చిత్రం దేని గురించో రాయలేదు. ఆ చిత్రం ఎలా ఉందో రాయలేదు. ఆఖరికి ఆ చిత్రం పేరేమిటో కూడా రాయలేదు. చిత్రకారుడి పేరు చిన్నగానైనా పేర్కొనలేదు.

రాసిం దంతా చిత్రం కొన్నవాడి గురించే!

అతడు కుమ్మరించిన డబ్బు గురించే!

ఎంత చిత్రం !

నవ్వుకున్నాడు హుస్సేన్!

"అవును మరి, అలాంటి చిత్రం అంత ధరకి కొనటమే వార్త. సృష్టించటం వార్తే కాదు!

చెక్కు తీసుకుని బయటి కొచ్చేశాడు హుస్సేన్. మనస్సులో చిన్న కోరిక తలెత్తింది. కాసేపు వెనకా, ముందూ వూగి మళ్ళీ లోపలి కెళ్లాడు.

"ఏమైనా మర్చిపోయారా ?"

"నహీ బేటా! నా పెయింటింగ్ కొన్నవారి పతా ఇస్తవా ? ఏక్ బార్ జర సూద్దావనీ"

తన చిత్రాన్ని ఎక్కడ ఎలాంటి స్థానంలో పెట్టారో చూడాలన్న తపన! తన పెయింటింగ్ నంత డబ్బుపోసి కొన్నవాడి కళా పిపాసని అభినందించాలన్న ఆకాంక్ష!

బంజారా హిల్స్‌లోని ఓ పెద్ద భవంతి గేటు తీసుకుని లోపలి కెళ్లాడు హుస్సేన్.

డ్రాయింగు రూములో కూర్చోబెట్టాడు నౌకరు.

ఎక్కడ్నుంచో చక్కని సంగీత తరంగాలు మంద్రంగా తేలి వస్తూంటే వింటూ హాలుని పరిశీలనగా చూశాడు.

అడుగడుగునా డబ్బు పరచినట్టు రిచ్‌గా ఉంది. ఖరీదైన భారీ సోఫాలూ, మేజాలూ, డోర్ టు డోర్ కార్పెట్లూ, బంగారు వర్ణపు కాంతిని వెదజల్లే షాండ్లియర్.... అగాయతడి చూపులు.

గోడకి తగిలించి ఉం దతడి చిత్రం.

డ్రాయింగ్ హాల్లోకి ఎవరొచ్చినా వారి చూపు లాకర్షించే చోట అందంగా, పొందికగా ఉంది.

లేచి తడబడుతూ సమీపించాడు.

తను మలచిన విగ్రహం గర్భగుడిలో దేవుడై పూజలందుకుం టుంటే చూసిన శిల్పిలా ఆనందాశ్రువులు రాలుస్తూ చూశాడు. ఆర్తిగా తడి మాడు.

కాస్సేపటి కొచ్చారు శ్యాం సుందర్. పైపు కాలుస్తూ, ఆయన వెంటే వచ్చి ఒడిలో ఎక్కి కూర్చుంది బొచ్చు కుక్కపిల్ల.

అప్రయత్నంగా చేతులు జోడించాడు హుస్సేన్.

"హుఁ ఎవర్నువ్వు ?" హుందాగా సోఫాలో కూర్చుని గర్జించి నట్టుగా అడిగారు.

"నేను...." ఎలా పరిచయం చేసుకోవాలా అని మీమాంసలో పడ్డాడు.

అతడి మౌనాన్ని మరోరకంగా అర్థం చేసుకున్నా రాయన, "దానం కోసమా? చందా కోసమా ? ప్రతివాడికీ సులువుగా డబ్బు సంపా దించేయాలన్న యావ ఎక్కువై పోయింది !"

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు ఫీలయ్యాడు హుస్సేన్.

"మాఫ్ కీజియే! ఇది- ఈ పెయింటింగ్ నాది. నేనే వేశాను."

"అలాగా! నే నింకేదో అనుకున్నానే! నీ పెయింటింగ్ బాగా నచ్చింది. ముఖ్యంగా నీ ఐడియా అద్భుతం. కాలానికి ఎదురీదాలని చూస్తే సత్యం లాంటి వాళ్లు నాలాంటి వాళ్ళ చేతుల్లో దారుణంగా మరణిస్తారని భలేగా చెప్పావే! అందుకే అంత డబ్బు పోసి కొన్నాను. నా డ్రాయింగ్ హాల్లో వేలాడదీశాను. అది సత్యంలాంటి వాళ్ళకి గుణపాఠం- హెచ్చరిక!"

భూమీ, ఆకాశం ఒక్కసారే బద్దలై తనను కబళిస్తున్నట్టు అదిరి పడ్డాడు హుస్సేన్.

"ఆప్.... మీరు...."

"నేను నేనే! శ్యాంసుందర్ ద గ్రేట్ ఇండస్ట్రియలిస్ట్ని !"

ఆయన కళ్లు నవ్వుతున్నాయి. చిలిపిగా, కసిగా నవ్వుతున్నాయి. ముఖం మెల్లగా కఠినంగా మారిపోతుంటే గుడ్లప్పగించి చూస్తూండి పోయాడు హుస్సేన్.

"మీ కళాకారులంతా నిజంగా పిచ్చోళ్ళు. చిన్న వెలుగు కిరణాన్ని హీరోగానూ, ఏనుగంత చీకటిని విలన్‌గా చూస్తారు- చిత్రిస్తారు. ఎంచేతో తెలుసా? అంతకంటే ఏమీ చేయలేక, చేతకాక. ఆఖరికి మీ చిత్రాల్ని కొనాలన్నా మేమే దిక్కు. అది గ్రహించక కొండతో ఢీ కొన్నాడు సత్యం. నుగ్గునుగ్గై పోయాడు."

పగలబడి నవ్వాడు.

హుస్సేన్ రక్తం సలసల మరిగింది.

సందేహం లేదు. సత్యాన్ని చంపింది ఈయన నియమించిన గూండాలే!

యా అల్లా! ఎంత ఘోరం జరిగిపోయింది!

సత్యం హంతకుడే 'సత్యం వధ' చిత్రాన్ని కొన్నాడు. చిత్ర భావాన్ని వక్రంగా తన కలుకూలంగా మార్చుకుంటున్నాడు. తనే రైటని చెప్పడానికి తన పెయింటింగ్‌ని ఉదాహరణగా వాడుకోబోతున్నాడు!

ఇలాటి కసాయికి తన సృష్టిని- కాదు. ప్రాణాన్ని అమ్మటమా?
పీడిల్చిన డబ్బుని - నెత్తురు కూడుని సత్యం పిల్లలకి పెట్టడమా?
"అలా జరక్కూడదు. జరగనివ్వడు!"

జేబులోని చెక్కుని ఆయన మీదకి విసిరేశాడు. విసురుగా వెళ్ళి గోడకి తగిలించిన పెయింటింగ్‌కి బంధ విముక్తి కలిగించాడు. దాన్ని చంకన పెట్టుకుని వడివడిగా బయటకు నడిచాడు హుస్సేన్.

అవాక్కైపోయాడు శ్యాం సుందర్.

అహం దెబ్బతిన్నట్టు చూశాడు. కాని అప్పటికే అతడు గేటు దాటేశాడు.

"పిచ్చివాడు" అన్న మాటలు అతడి గొంతులోనే సమాధి అయిపోయాయి చిత్రంగా!

—o—

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 27-10-93)